

భద్రయ్యచారి దంపతులను సన్మానిస్తున్న ఉషాదయాకర్‌రావు

## వృత్తిరీత్యా ఉద్యోగ విరమణ తప్పదు

**ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు**

పెద్దవంగర, అక్టోబర్ 15: వృత్తిరీత్యా ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో పెద్దవంగర పోస్టల్‌శాఖలో బీపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న బోగోజు భద్రయ్యచారి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగం పొందిన నాటి నుంచి వయస్సు పైబడడంతో ఉద్యోగానికి మాత్రమే విరమణ అన్నారు. కార్యక్రమంలో వరంగల్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ నరసింహస్వామి, ఐపీవో సైదానాయక్, పాలకుర్తి దేవస్థానం, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, పాలకుర్తి ఎంపీపీ నాగిరెడ్డి, పెద్దవంగర సర్పంచ్ లక్ష్మి, గుర్తూరు సర్పంచ్ సాహితీ రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.



రహదారి వెంట ఆహ్లాదం పంచుతున్న హరితహారం చెట్లు

## హరితమయంగా బీచ్‌రాజుపల్లి రహదారి

మరిపెడ, అక్టోబర్ 15: పర్యావరణ సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నది. మండలంలోని బీచ్‌రాజుపల్లి గ్రామంలో హరితహారంలో భాగంగా రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి పచ్చగా, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దీంతోపాటు విధిగా ప్రతి ఇంటిని భాగస్వామ్యం చేస్తూ ఆరు మొక్కల సంరక్షణకు పాటుపడ్డారు. పల్లె ప్రకృతివనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మొక్కలు వృక్షాలై రహదారులు హరితమయమై పచ్చని తోరణాలుగా దర్శనస్తున్నాయి. జాతీయస్థాయి అవార్డును సైతం దక్కించుకున్న బీచ్‌రాజుపల్లి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది.

## ముమ్మరంగా రహదారి పనులు

మరిపెడ, అక్టోబర్ 15: మున్సిపల్ కేంద్రం నుంచి అబ్బాయిపాలెం వరకు రెండు కిలోమీటర్ల మేర రూ.1.5 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హౌసింగ్‌బోర్డు, లోక్యాతండా మీదుగా అబ్బాయిపాలేనికి మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడనున్నది. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు కృషితో రోడ్డు పనులకు నిధులు మంజూరైనట్లు జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు పానుగోత్ వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌డీ లతీఫ్ తెలిపారు.



కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

## క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- *పల్లెల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు*
- *వాటిని సద్వినియోగం చేసుకోవాలి*
- *క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి*
- *ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి*



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి

తొర్రూరు, అక్టోబర్ 15: క్రీడలకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నదని ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన 67 రాష్ట్రస్థాయి 17, 19 ఏళ్ల బాల, బాలికల రగ్బీ పోటీలు ఆదివారం ముగిశాయి. 10 జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా, అండర్-19 బాలుర విభాగంలో నల్లగొండ జిల్లా విజేతగా నిలిచింది. రన్నరప్‌గా రంగారెడ్డి, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ విజేతగా నిలువగా, ద్వితీయ స్థానంలో మెదక్ నిలిచింది. అండర్-17 విభాగంలో విజేతగా నిజామాబాద్, ద్వితీయ స్థానంలో నల్లగొండ, బాలికల విభాగంలో విజేతగా మహబూబ్‌నగర్, ద్వితీయ స్థానంలో నల్గొండ నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలను ఏర్పాటు చేస్తున్నదని, ఇప్పటికే 50 శాతం పూర్తి చేసిందన్నారు. క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. రగ్బీ క్రీడలో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ క్రీడకు ఆదరణ పెరిగిందని, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య, రాష్ట్ర పరిశీలకులు యూసఫ్ ఖాన్, రమేశ్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సునీల్, రెమో శ్రీనివాస్, మాధవి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ప్రశాంతత

తొర్రూరు, అక్టోబర్ 15: క్రీడలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, మంచి ఆరోగ్యంతో పాటు సమైక్య స్ఫూర్తి, సహకార భావాన్ని పెంపొందిస్తాయని విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్, తొర్రూరు హై స్కూల్ హెచ్‌ఎం జల్లా లక్ష్మీనారాయణ, పెద్దవంగర హెచ్‌ఎం ఎర్రోజు విజయ్‌కుమార్ అన్నారు. ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ తొర్రూరు ఆధ్వర్యంలో హైస్కూల్‌లో నిర్వహించిన దసరా కప్ వాలీబాల్ టోర్నమెంట్ బహుమతులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవితంలో ఆటలు ఒక భాగం కావాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన శరీరం తయారవుతుందన్నారు. తొర్రూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు సంఘటితంగా ఆటలు ఆడడం స్ఫూర్తిదాయకమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల నగేశ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో ఈ క్రీడను మరింత బలోపేతం చేస్తూ జిల్లా స్థాయిలో కూడా నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కొండం జనార్దన్ రూ.5116(ప్రథమ), విద్యుత్‌శాఖ డీఈ మధుసూదన్ రూ.3116 (ద్వితీయ), నరేశ్ రూ.2116(తృతీయ) మహుమతి అందజేశారు. దసరా కప్ ప్రథమ బహుమతిని నాగరాజు అండ్ టీం, ద్వితీయ బహుమతిని సంతోష్ అండ్ టీం, తృతీయ బహుమతిని మహేశ్ టీం గెలుపొందారు. పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి ప్రత్యేక బహుమతి అందజేశారు. ఆర్థిక సహకారం అందించి, బహుమతులు ప్రదానం చేసిన జనార్దన్, మధుసూదన్, నరేశ, హెచ్‌ఎం లక్ష్మీనారాయణను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ తొర్రూరు గౌరవాధ్యక్షుడు ఎర్రోజు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి ఫణీంద్ర, సమన్వయకర్తలు రాయిపెల్లి యాకయ్య, ఉడుగుల మధుకర్, ఆటగాళ్లు సంతోష్, కే వెంకన్న, రఘు, రంజాన్, ఏ రవికుమార్, జీ వెంకన్న, జీ వెంకన్న, లింగరాజు, విజయ్, నవీన్, నాగరాజు, మురళి, లింగమూర్తి, డీ హుస్సేన్, రవి, వెంకట్‌రెడ్డి, జాఫర్ అలీ, యాకసాయి, సురేశ్, వెంకటేశ్వర్లు, అంపైర్లు సీ ఐలయ్య, జీ సతీశ్ పాల్గొన్నారు.



విజేతలతో డీఈ మధుసూదన్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ



ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం సభ్యులు

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నర్సింహులపేట, అక్టోబర్ 15: మండలంలోని పెద్దనాగారం గ్రామానికి చెందిన కొడి ఉమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతడి కుటుంబాన్ని ఆదివారం స్నేహ, సహచర మిత్రుల బృందం సభ్యులు పరామర్శించారు. అనంతరం రూ. 19,300 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆకేరువాగులో నీటి మళ్లింపు

**అడ్డుకున్న మునిగలవీడు గ్రామస్తులు**

నెల్లికుదురు, అక్టోబర్ 15: ఇసుక అక్రమ రవాణా కోసం ఆకేరువాగులో నీటి మళ్లింపు చర్యను నిలిపివేయాలని మునిగలవీడు గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ ఘటన మండలంలోని మునిగలవీడు-నర్సింహులపేట మండలం జయపురం శివారు ఆకేరు వాగులో ఆదివారం జరిగింది. ఆకేరువాగులో ఇసుక మెట్ట ప్రాంతం నుంచి నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నీటి ప్రవాహాన్ని దారి మళ్లిస్తే ఇసుకను రవాణా చేయవచ్చు. కాగా, పలు గ్రామాల ఇసుక ట్రాక్టర్ల యజమానులు జేసీబీతో ఆకేరువాగులో నీటిని మునిగలవీడు వైపునకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. అక్రమ ఇసుక రవాణా కోసం చేపట్టిన ఈ చర్యలను నిలిపివేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

## ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలి

తొర్రూరు, అక్టోబర్ 15: వంద రోజుల చాలెంజ్‌లో భాగంగా ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని డిపో మేనేజర్ పరిమళ అన్నారు. ఆదివారం 100 రోజుల ఫెస్టివల్ చాలెంజ్ జెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వంద రోజుల కార్యక్రమం ఈ నెల 15 నుంచి జనవరి 22 వరకు అమలులో ఉంటుందన్నారు. దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం అధిక సంఖ్యలో బస్సులు నడిపి సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం సెప్టెంబర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి జీ రజిత, గ్యారేజ్ ఇన్‌చార్జి ఎస్‌డీ సమద్, కంట్రోలర్స్, ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానించి అభినందిస్తున్న డీఎం పరిమళ

**ఉద్యోగులకు అండగా నిలుస్తాం**

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలుస్తామని తొర్రూరు డీఎం పరిమళ తెలిపారు. డిపో కండక్టర్ సోమ్లానాయక్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా, అతడి కుటుంబ సభ్యులను ఆదివారం డివిజన్ కేంద్రంలో డీఎం పరిమళ పరామర్శించారు. ఓదార్చి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కండక్టర్లు, డ్రైవర్ల సహకారంతో తొర్రూరు డిపోను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఇకపై సంస్థ లాభనష్టాలు సంస్థ ఆదాయంతో నిమిత్తం లేకుండానే ఉద్యోగుల బాగోగులకు ప్రభుత్వం నుంచి భరోసా లభించనున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీ మల్లికార్జున్, బానోత్ నారాయణ, జిలుకర యాదగిరి, సిబ్బంది జీ రమేశ్, పుల్లయ్య, సీహెచ్ స్వామి, యాకయ్య పాల్గొన్నారు.